కథానిక

# తమరి చేతులేం చెపుతున్నాయ్?

## అంగర సూర్యారావు

"తమరి చేతులేం చెబుతున్నాయ్? నేడే తెలుసుకొండి. ఆశావహమైన భవిష్యత్తును నిర్మించుకొండి."

ఆగిపోయాడు అతను. తను ప్రేమించిన శ్యామల తనకు అందడంలేదు. తండ్రి మిగిలించిన ఆస్తి కాస్తా అప్పులవాళ్ళు పట్టుకుపోయారు. మిగిలిందో పాతయిల్లు. సవతి తల్లి, కనుచూపు మేరలో తన భవిష్యత్తును సుగమ్యంగా గోచరించడంలేదు. కనీసం అదృష్టంవల్లనైనా శ్యామల తనదైతే తను దరిద్రాన్నే కాదు మహా సముద్రాన్నైనా యీదడానికి వెనకాడడు. తనకో పది వేలరూపాయల ఆస్తి ఐనా వుంటే శ్యామల తండ్రి శ్యామలను తనకు యిచ్చి పెళ్ళి చేసివుండేవాడు. శ్యామలను తను వివాహం చేసుకొని వుంటే కట్నాలూ కానుకలూ కలిసి కనీసం పది వేల రూపాయలైనా లభించివుండేవి. కాని డబ్బుంటే కాని పెళ్ళి కాదు. పెళ్ళైతే కాని డబ్బు రాదు. గొప్పసమస్య-వచ్చి పడింది.

మరోసారి అతను బోర్డుకేసి చూశాడు.

"తమరి చేతులేం చెబుతున్నాయ్?" అని తిరిగి ప్రశ్నించింది బోర్డు. ఏం చెబుతున్నాయో తెలుసుకునేందుకు అతను లోనికి దారి తీశాడు.

విశాలమైన హాలుమధ్య ఒక టేబిలు. టేబిలుమీద పుస్తకాలు. టేబిలుచుట్టూ కుర్చీలు. గోడలనిండా రకరకాల రేఖలతోకూడిన హస్తాలను చిత్రించిన చిత్రపటాలు వున్నాయ్. టేబిలుముందు కుర్చీలో మధ్య వయసులోవున్న ఒక వ్యక్తి కూర్చుని వున్నాడు. ఖద్దరులాల్చీ నల్లని గుబురుగడ్డం బొద్దుమీసాలు నొసట కుంకుమరేఖలు నిండైన విగ్రహం. అతన్ని చూడగానే మహాశక్తిసంపన్నుడైన వ్యక్తిలా తోచాడు అతనికి.

"రా! నాయనా కూర్చో!" ఆహ్వానించాడు జ్యోతిష్కుడు.

కూర్చున్నాడు.

"నీపేరేమిటి?"

"సుందరరావు."

"చూడు నాయనా! ఈ బదరీనాథ్ చెప్పింది బ్రహ్మదేవుడైనా కాదనలేడు. ఆసేతు హిమాచలపర్యంతం పర్యటించి నిరాశావహమైన మానవ హృదయాలలో ఆశాజ్యోతిని రగిలించాను. ఏ ఊరిలోనూ వారంరోజులకంటె ఎక్కువవుండను. ఇది గురువాజ్ఞ. ఒక ప్రాంతపు ప్రజకే ఎప్పుడూ సేవచేస్తూ కూర్చోకూడదు. దేశాటనంచేస్తూ దేశ ప్రజలందరికీ సేవచెయ్యాలి. ఎందరో జమీందార్లు కోటీశ్వరులు ప్రజల క్షేమంకోరి నాచేత సాముద్రికం గురించి వ్యాసాలు వ్రాయించి పత్రికలలో అచ్చువేయించుకుంటున్నారు. నిజంగా నమ్ము! నమ్మకపో! యీ కోటీశ్వరులు లేకపోతే సాముద్రిక శాస్త్రం ఏనాడో నశించిపోయి వుండేది. చెట్టుయొక్క ఆకుచూచి చెట్టు గుణగణాలను శాస్త్రవేత్త ఏవిధంగా చెబుతాడో అదేవిధంగా మానవహస్తాన్ని పరిశీలించి సర్వం జ్యోతిష్కుడు చెప్పగలడు. చూడు నాయనా! నేను ఉపన్యాసం చెబుతున్నానని అనుకోవద్దు. జ్యోతిషం చెప్పబోయేముందు — దానిమీద సరైన అభిప్రాయం కలిగేందుకు—కొంచెం ఉపోద్ఘాతం చెప్పడం అవసరం. ఏదినాయనా! నీ హస్తం యిటు చూపు" అన్నాడు బదరీనాథ్.

పేరు చివర 'నాథ్' అన్న అక్షరాలుగల వాళ్ళనుచూస్తే సుందరరావుకు తన్నాలని బుద్ధి పుడుతుంది. కాని బదరీనాథ్ పేరు విన్న వెంటనే అతనికి తన్నాలని బుద్ధిపుట్టలేదు సరికదా నమస్కరించాలని బుద్ధిపుట్టింది. తనచేతిని అతివినయంగా బదరీనాథ్ చేతికి అందించాడు.

బదరీనాథ్ ముఖం క్షణంలో గాంభీర్యాన్ని వహించింది. అతని చూపులు తీక్ష్ణంగా మారి

పోయాయి. "నీకు 24 సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ అదృష్టం నీదరికి రాకుండాపోతుంది. ప్రస్తుతం నీ వయస్సు 24సంవత్సరాలు. అవునా?" సుందర్రావు కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు బదరీనాథ్.

తన వయసును ఖచ్చితంగా చెప్పగలిగినందుకు ఆశ్చర్యపోతూ "అవును" అన్నాడు సుందర్రావు.

"ఇంతవరకూ నీవు అమితమైన కష్టాలను అనుభవించావు. ఇకముందు నీకు కష్టాలులేవు. నీ అదృష్టరేఖకు గల అడ్డంకులన్నీ చెరిగిపోయాయి. ఆకస్మికంగా ధనవంతుడయ్యే అవకాశం నీకు వుంది. శత్రువులవల్ల కొన్ని బాధలు కలుగుతాయి. కాని గురు కుజులు అనుకూలంగా వున్నందువల్ల అవి యిట్టే తొలగిపోతాయి. ఇదిగో యీ రేఖ వుంది చూశావూ యిది భోగలాలసతను సూచిస్తుంది. ఈ రేఖగలవాడికి స్త్రీల నాకర్షించేశక్తి అధికంగా వుంటుంది. నీకు వివాహయోగంకూడా యీ సంవత్సరంలోనే వుంది. కాగా పోగా సంవత్సరాంతంలో నీకు ఒక గండంవుంది. అది కూడా దాటిపోతే నీయంత అదృష్టవంతుడు ఎవడూ వుండడు."

సుందర్రావు హృదయంలో ఆశాజ్యోతి వెలిగింది. ఇంతవరకూ ఆవరించియున్న చీకట్లు చెదిరిపోయాయి. జేబులోంచి ఒకరెండు రూపాయల నోటు తీసి భక్తి వినయాలతో బదరీనాథ్‌కు అర్పించాడు. బయటకు వచ్చాడు.

వెంకట్రావుగాడు జ్యోతిషం శుద్ధ అబద్ధం అని చెబుతాడు. వాడేకాని ఇప్పుడు కనిపించి వుంటే చెవి మెలేసి వుండేవాడు. జరిగింది జరిగినట్లు జరగబోయేది జరగబోతున్నట్లు ఎంత అమోఘంగా చెప్పాడు యీ బదరీనాథ్! ఆకస్మికంగా తనకు సంపద కలుగుతుందని చెప్పాడు. ఎలా కలుగుతుంది? తనలో స్త్రీలనాకర్షించేశక్తి అమితంగావుందన్నాడు. తాను శ్యామలను ఆకర్షించగలిగి ఆమె తననే వివాహం చేసుకుంటే క్షణంలో తను ఐశ్వర్యవంతుడై కూర్చుంటాడు. యిదే అదృష్టానికి ఐశ్వర్యానికి దగ్గరిదారి. ఉత్సాహంతో పెద్ద అడుగులు వెయ్యడం ప్రారంభించాడు. పత్రికలమ్మే కుర్రాడికేక అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. మేగజైన్లకేసి అప్రయత్నంగా చూశాడు. ఒకపత్రికయొక్క ముఖపత్రసుందరి చిరునవ్వుతో అతనిని యిట్టే ఆకర్షించింది. ఆ పత్రికను వెంటనే కొనేశాడు. పేజీలు తిప్పుతూ రోడ్డుకు ప్రక్కగా నడుస్తున్నాడు.

"ఏరోయి సుందర్రావు! ఏమిటి? రోడ్డుమీద కూడా చదివేస్తున్నావ్?"

సుందర్రావు తలెత్తి చూశాడు. వెంకట్రావు తిన్నగా కనిపించాడు.

"ఈ పత్రిక నాకొకసారి యివ్వరా! చదివేసి నీకు రేపు యిస్తాను." తిరిగి అన్నాడు వెంకట్రావు అతనిచేతిలో పత్రిక లాక్కుంటూ.

"కొని యింకా అయిదునిమిషాలైనా కాలేదు. అప్పుడే ఎరువటరా దౌర్భాగ్యుడా! నువ్వొకటి కొనుక్కోకూడదూ?"

"ఒరేయి సుంధర్రావు! యీ దేశంలో పత్రికలమీద అభిరుచి వున్నవాడికి డబ్బుండదు. డబ్బున్నవాడికి పత్రికలమీద అభిరుచి వుండదు. అసలు డబ్బుంటే పత్రిక కొనుక్కోవడమేంకర్మం ఒకపత్రికే స్వంతంగా నడిపివుండేవాణ్ణి."

"సరే! దానికేంగాని యిప్పుడో అద్భుతమైన విషయం మీ యింటికివచ్చి నీకు చెప్పాలనుకుంటున్నాను. యింతలో నువ్వే కనిపించావ్."

"ఏదైనా లాటరీ గురించా? లేక పజిలు గురించా? నీ అదృష్టంలో యింతకంటె అద్భుతమైన విషయాలేమున్నాయ్?"

"అవేంకాదు! అసలు చెప్పేది వినరాబాబూ" చిరాగ్గా అన్నాడు సుదర్రావు.

సముద్రమొడ్డున సిమెంటుగట్టుమీదకూర్చుని అతనుచెప్పే విషయాన్ని శ్రద్ధగా వినసాగాడు వెంకట్రావు. సుందర్రావు అతని పక్కనే కూర్చుని జ్యోతిష్కుడు చెప్పిన తన భూత భవిష్యద్వర్తమానాలనుగురించి వాటిలోని నిజాయితీనిగురించి తన్మయత్వంతో చెప్పాడు.

"ఒరేయి వెంకట్రావు! జ్యోతిషం అద్భుతమైన శాస్త్రం అన్నది నాకీనాటికి దృఢపడింది. అతను చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజం. ఇక నేను శ్యామలగురించి ప్రయత్నం చేస్తాను. నా ప్రయత్నం తప్పకుండా ఫలించి తీరుతుంది" ఉత్సాహంతో ముగించాడు సుందర్రావు.

"అయితే మళ్ళా నువ్వు మరో వెర్రిలో పడ్డావన్నమాట!" అన్నాడు వెంకట్రావు తాపీగా సిగరెట్టు వెలిగించి.

"ఇదేం వెర్రి కాదురా! మహాశాస్త్రం!" అన్నాడు—తనవాదనను సమర్థించుకుంటూ—సుందర్రావు.

"దరిద్రభారంతో క్రుంగిపోయే దేశాలలో యిలాంటి బైరాగిచిట్కాలెన్నో తలెత్తుతూ వుంటాయి. ఇప్పుడు నువ్వు జ్యోతిషం మహాశాస్త్రం అంటున్నావు. ఏది మహాశాస్త్రం కాదు? ఉదాహరణకు పజిల్సు చూడు! పజిలు సాల్వు చెయ్యడానికి భాషలో మంచి ప్రవేశం వుండాలి. ఒక పెద్ద నిఘంటువు వుండాలి. కనక అదికూడా మహాశాస్త్రమే! అలాగే బ్రాకెట్లు కట్టడానికి కూడా అంకెలూ లెఖ్ఖలూ కావలసినంత శాస్త్రం వుంది. గుర్రపు పందాలకుకూడా ఏ గుర్రం ఏ నక్షత్రంలో గెలుస్తుందో వగైరా కావలసినంత శాస్త్రం వుంది."

"అయితే యింతకూ నువ్వు జ్యోతిషం అబద్ధమంటావ్?" సీరియస్‌గా అడిగాడు సుందర్రావు.

"అది అబద్ధం అవనీ! నిజం కానీ! దానివల్ల మానవుల కేమాత్రం ప్రయోజనం లేదంటాను. జరిగిపోయినది మనకు తెలుసు - జరుగుతున్నది మనం చూస్తూనే వున్నాం—జరగబోయేది ఎలాగు జరగక మానదు. ఇక శాస్త్రంవల్ల ప్రయోజనం ఏమిటి?"

"పోరా ఫూల్! నీలాంటి నాస్తికులవల్లే మన మహా శాస్త్రాలన్నీ తగులడిపోతున్నాయ్" కోపంతో యిల్లు చేరుకున్నాడు సుందర్రావు.

వెంకట్రావుగాణ్ణి నిలువునా చీరేసినా పాపం లేదు. ప్రతి విషయాన్ని శంకించడం వాడికో జబ్బు. యీ సంవత్సరాంతంలోగా కన్యా కనకాలతో కూడిన అదృష్టం తనకు సిద్ధించి తీరుతుంది. దానితో వెంకట్రావు వాదనకు పరాజయం కలుగుతుంది.

భోజనం ముగిసేసరికి సుందర్రావుకు కొంచెం కోపం చల్లారింది. మంచంమీద పడుకొని పత్రిక చూడడం ప్రారంభించాడు. ఎనిమిద పేజీదగ్గరకు వచ్చేసరికి అతను ఆశ్చర్యంతో ఆగిపోయాడు. ఆ పేజీలో "మానవహస్తం-సాముద్రికశాస్త్రం" అన్న శీర్షికతో పెద్దవ్యాసం ఒకటి కనిపించింది. వ్యాసకర్త బదరీనాధ్! బదరీనాధ్ నిజంగా గొప్పవాడన్న విషయం దీనితో అతనికి ఋజువయ్యింది. చేతిలోని ఒక రేఖలోని చిన్న మార్పువల్ల జీవితమార్గంలో ఎలాంటి గారడీలు జరుగుతాయో ఆ వ్యాసం విశదీకరిస్తోంది. ఆ వ్యాసాన్ని ఆమూలాగ్రం అతిశ్రద్ధగా చదివాడు సుందర్రావు. మళ్ళా ఆ పత్రికలో నలభైరెండో పేజీ వచ్చేసరికి సుందర్రావుకు గుండె ఆగిపోయినంత పని జరిగింది. "పది అణాలతో పదివేల రూపాయలు గెలుచుకోండి!" అని తాటికాయలంత అక్షరాలతో అచ్చుపడివుంది, ఆ పజిలు సాల్వుచేసి పదిఅణాల ప్రవేశ రుసుముతో సహా పోస్టుచేస్తే పదివేల రూపాయలు రావచ్చు. పోతే పదిఅణాలు పోతాయి. ఒకసారి సినిమాకు ఖర్చు అయినంతయినా లేదు. తన అదృష్టరేఖలో అపూర్వమైన మార్పులు కలిగివున్నప్పుడు పోవడమేమిటి? తను తప్పకుండా గెలుస్తాడు. తను పట్టిందంతా బంగారమై తీరుతుంది. ఎందుకోగాని తనమీద తనకే దృఢమైన విశ్వాసం కలుగుతోంది. అప్పటికప్పుడు కలం తీసి పజిలు సాల్వు చెయ్యడానికి ఉపక్రమించాడు.

ఆరోరా పజిల్ కంపెనీవాళ్ళు శ్రీ సుందర్రావుగారిని ఫొటో పంపించమని ప్రాధేయపడుతూ ఉత్తరం రాశారు సుందర్రావు దీర్ఘాలోచనలో వున్న పోజులో ఫొటో తీయించుకొని పజిలు కంపెనీవారికి పంపించాడు. వెంటనే దినపత్రికలలోను మాసపత్రికలలోను సుందర్రావు ఫొటో అచ్చుపడిపోయింది. అతని ఫొటో క్రింద "వీరు మొదటి ప్రయత్నంలోనే పది అణాలతో పదివేలు గెలుచుకున్నారు. మీరు కూడా నేడే ప్రయత్నించండి" అని రాసివుంది. సుందర్రావు కీర్తి దశదిశలు నిండిపోయింది. మారు మూలనున్న స్నేహితులు కూడా అతనికి "కంగ్రాచ్యులేషన్సు" పంపించసాగారు. వాళ్ళ ఉత్తరాలకు జవాబు రాయడానికి సుందర్రావునకు తేరిక లేకపోయింది. తక్షణం ఒక అంతరంగిక కార్యదర్శిని నియమించుకున్నాడు. తన పాత యింటిని కొత్త యిల్లుగా మరామత్తు చేయించుకున్నాడు. మనిషిలో కూడా చాలా మార్పు వచ్చింది.

యిదివరకు ఎండకు నల్లగా మాడిపోయినట్లువుండే మనిషి యిప్పుడు పచ్చగా దబ్బపండులా తయారయ్యాడు. అతనిలో కొంత ఠీవి ఏర్పడింది. వూళ్ళో ఎక్కడకు వెళ్ళినా అతనికి అమితమైన గౌరవమర్యాదలు జరుగుతున్నది. చేతిలోని ఒక చిన్న రేఖలోని మార్పువల్ల ఎంత అద్భుతమైన సంఘటనలు జరుగుతాయి. అతను చాలా ఆశ్చర్య పోయాడు.

ఒకనాడు సాయంకాలం నాలుగు గంటలవేళ షికారుకు బయలుదేరాడు. రెండడుగులు వెయ్యగానే ఒక కారు కనిపించింది.

"ఏయ్ టాక్సీ!" పిలిచాడు సుందర్రావు.

కారువచ్చి ఆగింది. సుందర్రావు ఠీవిగా కారులోకూర్చున్నాడు. కారు వీధులన్నీ తిరిగి ఒకభవనం ముందుకువచ్చి టక్కున ఆగింది. కారు చప్పుడుకు భవనంలోంచి ఓ నవజవ్వని బయటకు వచ్చింది. వెంకట్రావు తను కలిసిచూసిన—ఒకనాటి భరతనాట్యంలో తమ మనసును ఆకర్షించిన—రాగిణి యీమేనని రెప్పపాటుకాలంలో గుర్తించాడు సుందర్రావు. రాగిణి చిరునవ్వుతో "లోనికిరండి!" అని ఆహ్వానిస్తూ "వీరిని తీసుకు వచ్చావేం?" అని డ్రైవరును ప్రశ్నించింది.

"వీరు—పాపం!—టాక్సీకోసం వెతుకుతున్నారు నన్ను పిలిచారు. ఇటువంటి గొప్పవారి యిష్టానికి వ్యతిరేకంగా నడవడం నాకు అలవాటు లేదు కనక వీరిని వెంటనే కారులో ప్రవేశపెట్టారు!" సంజాయిషీ చెప్పుతున్నాడు డ్రైవర్.

మనసులో యిష్టంగావున్నా పైకి అయిష్టాన్ని వెలిబుచ్చుతూ ఆమె ఆహ్వానాన్ని అంగీకరించి లోనికి అడుగుపెట్టాడు.

ఆ రోజు మొదలు ప్రతిరోజూ రాగిణీ సుందర్రావులు రాగిణి కారులో షికారు వెడుతూ వుండడం పురజనులందరూ చూశారు. సుందర్రావు రహస్యంగా తన చేతిలోని స్త్రీ వశీకరణ రేఖను చూసి ఉప్పొంగిపోయాడు.

శ్యామల తండ్రి ఒకనాడు స్వయంగావచ్చి తన కూతుర్ని సుందర్రావుకు యిచ్చి—ఉభయ ఖర్చులూ తానే భరించి—వివాహం చెయ్యడానికి అంగీకరించాడు. సుందర్రావు ఆలోచించి చెబుతానని సగర్వంగా జవాబు చెప్పాడు. అతని మనసులో ప్రస్తుతం శ్యామలకు చోటులేదు. ఉన్నచోటంతా రాగిణి ఆక్రమించుకొంది. ఓహో రాగిణీ! ఏమి హొయలు! ఏమి సొగసు! అతని హృదయం స్పందించింది. వెంటనే తిరిగి రాగిణి యింటికి వెళ్ళిపోయాడు.

వెంకట్రావు ఒకరోజు దారిలో ఎదురై ఐదు రూపాయలు అప్పు కావాలని సుందర్రావును ప్రాధేయపడి అడిగాడు. ఐదురూపాయలు కాదు కదా అరకప్పు కాఫీకూడా యిప్పించను పొమ్మన్నాడు. జ్యోతిషం మహాశాస్త్రం అని అంగీకరిస్తేనే నీ ముఖం చూస్తాను. లేకపోతే చూడనని ఖండితంగా చెప్పేశాడు. జ్యోతిషాన్ని శాస్త్రంగా గుర్తించడానికి వెంకట్రావు నిరాకరించాడు. ఎవరిదారిని వాళ్లు పోయారు.

ఒకనాడు ఒంటరిగా తాను ఇంట్లో కూర్చున్నప్పుడు శ్యామల కనపడింది. రోజూ శ్యామల వాళ్ళ యింటికివచ్చి పువ్వులు కోసుకుని వెడుతూ వుంటుంది. కానీ రోజూ ఆమె అతని కంటికి కనిపించడంలేదు. ఇవేళమాత్రం మబ్బుల్లో మెరపుతీగలా కనిపించింది. రాగిణిలో వున్నది కృత్రిమమైన సౌందర్యం యీమెలోవున్నది సహజమైన సౌందర్యం అని అతను గుర్తించాడు.

"శ్యామలా!" అని పిలిచాడు.

ఆమె ఆగింది. అతను ఆమె సమీపానికి వెళ్ళాడు. ఆమెచేతిని తనచేతిలోకితీసుకున్నాడు. ఆమె ఎర్రటి పెదిమలమీద చిరునవ్వు నృత్యం చేస్తోంది. ఆమె చేతిలోనిరేఖలను పరిశీలించాడు. ఆశ్చర్యం! తన చేతిలోని రేఖలే ఆమె చేతులోనూ వున్నాయ్! పారవశ్యంతో ఆమెను కౌగిలించుకొని ముద్దు పెట్టుకోబోయాడు. ఆమె లేడిలా బెదురు చూపులతో అతనికి అందకుండా పోయింది.

సుందర్రావు వెంటనే తన ఆంతరంగిక కార్యదర్శిని శ్యామల తండ్రి దగ్గరకు పంపించాడు. పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళిసందర్భంలో భరతనాట్యం చెయ్యడానికి రాగిణి నిరాకరించింది. మరో వూరినుంచి నర్తకీనర్తకులను రప్పించారు. వైభవోపేతంగా శ్యామలా సుందర్రావుల వివాహము జరిగిపోయింది.

ఒకనాటి రాత్రి ఒంటరిగా గదిలో పడు

కున్నాడు సుందర్రావు. అతని మనోవీధి అతి నిర్మలంగా వుంది. మరో వారం రోజులు గడిస్తే శ్యామల నిత్యం తన ప్రక్కనే వుంటుంది. తనజీవితం ఎంత అద్భుతమైన మార్గంలోంచి పయనిస్తోంది. గడియారం ఠంగుఠంగున పదిగంటలు కొట్టింది. కిటికీలోంచి బయటకు చూశాడు. గాఢాంధకారం. యీదురుగాలికి కిటికీ రెక్కలు రెపరెప కొట్టుకుంటున్నాయ్. బయట బయట అడుగుల సవ్వడి వినిపించింది. ఒకసారి కిటికీలోంచి బయటకు తొంగి చూశాడు. దట్టమైన చీకటిలో చెట్లు తలలు విరియబోసుకున్న దయ్యాలలా కనిపించాయి. ఎవరూ లేదు. వట్టి భ్రమ. తిరిగి పడుకున్నాడు. నెమ్మదిగా అతనిగది తలుపులు తెరుచుకున్నాయి. చటుక్కున లేచిచూశాడు సుందర్రావు. నల్లని ముసుగులో వున్న ఒక వ్యక్తి తన్ను సమీపిస్తున్నాడు. అతని చేతిలో బాకు విద్యుల్లతలా మెరుస్తోంది. ఆ వ్యక్తి —యిక దాని అవసరం లేనట్లు— ముసుగుతీసి కింద పారేశాడు.

వాడు రాగిణి కారు డ్రైవర్! ఆశ్చర్యపోయాడు సుందర్రావు. వెంటనే సుందర్రావుకి జ్యోతిష్కుడు చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. అన్ని సౌఖ్యాలూ లభించిన తరవాత తనకు సంవత్సరాంతంలో పెద్దగండం వుందన్నాడు. యిక తనకి వీడిచేతిలో చావుతప్పదు. అతనికి ముచ్చెమటలు పోశాయి. శ్యామలతో కలిసి తను పూర్తిసుఖాలు యింకా అనుభవించనేలేదు. యింతలో తన జీవితం ముగుస్తోంది.

"ఎందుకలా ఒణికిపోతున్నావ్? రాగిణిని నీ జీవితంలో విడిచిపెట్టునని ప్రతిజ్ఞ చేశావు. రాగిణిని విడిచిపెట్టిన మర్నాడు నీ జీవితాన్ని ముగింపచెయ్యాలని నాలో నేను ప్రతిజ్ఞ చేసుకున్నాను" మీదికివస్తున్నాడు హంతకుడు.

"నువ్వు నిష్కారణంగా నన్నెందుకు చంపుతావు. కారు నడిపినందువల్ల నీ జీవితకాలంలో సంపాదించలేనంత డబ్బు నీకు నేనిస్తాను. నన్ను విడిచిపెట్టు!" బ్రతిమాలాడు సుందర్రావు.

"నేను కేవలం కారుడ్రైవర్నే అనుకుంటున్నావేమో! కాదు. నేను రాగిణి అన్నను. ఆమెకు కలిగిన పరాభవాన్ని చల్లార్చనిదే ఇక్కడి నుంచి కదలను" మీదికివచ్చాడు హంతకుడు. కత్తి పైకెత్తాడు. యింతలో హఠాత్తుగా ఎవరో వెనకనుంచివచ్చి హంతకుడిచేతిలో బాకు లాక్కుని హంతకుణ్ణి కిందపారేశాడు. సుందర్రావుకూడా హంతకుడిమీద కలియబడ్డాడు. యిద్దరూ కలిసి హంతకుణ్ణి కట్టిపారేశారు. తనను దేవుడిలా రక్షించిన వ్యక్తికేసి చూశాడు సుందర్రావు.

"నిజంగా నన్ను భగవంతుడిలా రక్షించావురా వెంకట్రావు. రాత్రివేళ ఎందుకువచ్చావు?"

"ఐదురూపాయలు అప్పుకోసంరా బ్రదర్" అన్నాడు దీనంగా చెయ్యిచాపుతూ వెంకట్రావు.

"ఐదురూపాయలుకాదు, ఐదువందలు తీసుకు వెళ్ళరా వెంకట్రావు!" అన్నాడు సుందర్రావు యిల్లు ప్రతిధ్వనించేలా.

"ఐదురూపాయలూవద్దు, ఐదువందలూవద్దు. అరకప్పు కాఫీ యిస్తేచాలు. ముందు లేవరా మొద్దూ!" ఒక్కటి కొట్టాడు వెంకట్రావు.

సుందర్రావు వులిక్కిపడి కళ్ళు తెరచిచూశాడు. తిన్నగా వెంకట్రావు కనిపించాడు. కుక్కిమంచం పాతయిల్లు, దరిద్రం మళ్ళీ సిద్ధం.

"రాత్రి భలే కలొచ్చిందిరా! అసలు కలలను సృష్టించినవాణ్ణి డొక్కచీరినా పాపంలేదు."

"నీలాంటి మూర్ఖులకు అరచేతిలో వైకుంఠం చూపించడానికి కలలు అవసరమే!" అన్నాడు వెంకట్రావు.

రోజులు గడుస్తున్నాయి. సుందర్రావుకి అదృష్టం మీద నమ్మకం తగ్గలేదు. పజిల్సు కడుతున్నాడు. కాని ప్రయోజనం కనిపించడంలేదు.

ఒకరోజు అతను ఒంటరిగా కూర్చున్నప్పుడు శ్యామల పువ్వులుకోసుకొనివస్తోంది. అతని మనసులో కలలోని దృశ్యం తటుక్కున మెరిసింది.

ఆమె ఆగింది. అతను ఆమెను సమీపించాడు. ఆమె చేతిని తనచేతిలోకి తీసుకొని, "నీ చేతులేం చెబుతున్నాయో నీకు తెలుసా?" అన్నాడు.

ఆమె తన చేతిని చటుక్కున వెనక్కిలాక్కొంది. కోపంతో అతని చెంపపై తన కోమల హస్తంతో చెళ్ళునకొట్టి చెంగున వెళ్ళిపోయింది.

ఇదికూడా కలయేమోనని మొదట సందేహించాడు. తర్వాత అద్దంలో తన ముఖాన్ని చూసుకున్నాడు. చెంప గులాబిరంగు కనిపించినందువల్ల యిది కలమాత్రం కాదని అతనికి రూఢి అయింది.